ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప జిల్లా వార్తలు

5

బుధవారం 21 ఫిబ్రవరి 2024

బిల్లులు చెల్లించకపోతే..
రాం రాం



● పార్టీ మారక తప్పదంటున్న వైసీపీ కాంట్రాక్టర్లు

బద్వేలు, ఫిబ్రవరి 20: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలకు సంబంధించిన పనులే కదా బిల్లులు తొందరగా వస్తాయని రోడ్డు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ల పరిస్థితి ఇపుడు దయనీయంగా మారింది. బద్వేలు మున్సిపాలిటీలో సిమెంటు రోడ్డు పనులు చేపట్టి రెండేళ్లవుతున్నా బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు తలలు పట్టుకుంటున్నారు. మున్సిపాలిటీలో రూ.27 కోట్ల మేరకు సిమెంటు రోడ్డు పనులు పూర్తి అయ్యి ఏళ్ల గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. మూడు నెలల క్రితం కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి బద్వేలుకు వచ్చినపుడు కాంట్రాక్టర్లు ఎంపీ ఎదుట తమ ఆవేదన వ్యక్తం చేశారు. 10 రోజుల్లో బిల్లులు ఇస్తామని ఎంపీ హామీ ఇచ్చినప్పటికీ బిల్లులు మంజూరు కాలేదు.

ఎన్నికల షెడ్యూల్ వస్తే..

ఎన్నికల షెడ్యూల్ విడుదలైతే తమ పరిస్థితి ఏమిటని కాంట్రాక్టర్లు ఎమ్మెల్సీ గోవిందరెడ్డి ఎదుట గోడుమనడమే కాకుండా.. వారంలోపు బిల్లులు రాకపోతే టీడీపీలో చేరుతామని చెప్పినట్లు సమాచారం. ఎన్నికల కోడ్ వస్తే బిల్లులు పూర్తిగా నిలిచిపోతాయని, కొత్త ప్రభుత్వం ఏర్పడితే ప్రస్తుతం చేసిన పనులకు బిల్లులు పూర్తిగా నిలిచిపోతాయేమో ఎమ్మెల్యే డాక్టర్ సుధ ఎదుట కూడా వీరు గగ్గోలు పెట్టినట్లు తెలిసింది. ఎన్నికల కోడ్ రాకముందే బిల్లులు చెల్లించకుంటే.. నియోజకవర్గ వ్యాప్తంగా పనులు చేసిన కాంట్రాక్టర్లందరూ టీడీపీలో చేరేందుకు సిద్ధమని తెగేసి చెప్పడంతో ఎమ్మెల్సీ గోవిందరెడ్డి అయోమయంలో పడ్డారని అంటున్నారు.

ఇప్పటికే పలువురు టీడీపీలోకి..

ఇప్పటికే బద్వేలు నియోజకవర్గంలో వైసీపీకి షాకులు మీద షాకులు తగులుతున్నాయి. ఇక్కడ వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా వలస పోతున్నారు. మండల స్థాయి నాయకులు, సర్పంచ్‌లు టీడీపీలోకి దూకేస్తుండడంతో నియోజకవర్గంలో వైసీపీకి ఊహించని ఎదురుదెబ్బ తగులుతోంది. దీనికితోడు బిల్లులు చెల్లించకపోతే పార్టీ మారుతామని కాంట్రాక్టర్లంతా చెప్పడంతో ఎమ్మెల్సీ గోవింద రెడ్డి, ఎమ్మెల్యే సుధలకు దిక్కుతోచడం లేదు. ఇప్పటికే కలసపాడు మండలం నుంచి మాజీ జడ్పీటీసీ భూపాల్‌రెడ్డి అతని అనుచరులు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువనేత రితేశ్‌కుమార్‌రెడ్డిల సమక్షంలో కలసపాడులో భారీ సంఖ్యలో టీడీపీలో చేరారు. అలాగే వైసీపీకి చెందిన అట్లూరు మాజీ మండలాధ్యక్షుడు రామక్రిష్ణారెడ్డి అతని అనుచరులు సైకిల్ ఎక్కేందుకు సిద్ధమయ్యారు. రోజురోజుకు వైసీపీని వీడి నేతలు సైకిల్ ఎక్కుతుండడంతో బద్వేలు నియోజకవర్గంలో వైసీపీ నేతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వైసీపీకి చెందిన కాంట్రాక్టర్లు కూడా పార్టీ మారే ఆలోచనలో ఉండడంతో ఎమ్మెల్సీ వారిని బుజ్జగించే ప్రయత్నంలో ఉన్నట్లు సమాచారం.

వైసీపీలో అసమ్మతి రగడ

- రాచమల్లుకు వ్యతిరేకంగా బరిలో కొనిరెడ్డి శివచంద్రారెడ్డి
- వేలాదిమంది కార్యకర్తలతో పోటీ ప్రచారం
- వేటు పడినా వెనుకాడేది లేదంటున్న వైనం
- అసమ్మతి సెగతో వేడెక్కిన ప్రొద్దుటూరు వైసీపీ



ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 20: ప్రొద్దుటూరు వైసీపీలో అసమ్మతి రగడ ముదిరి పాకాన పడింది. కొంతకాలంగా కొత్తపల్లె సర్పంచ్ శివచంద్రారెడ్డి నేతృత్వంలో అసమ్మతి నేతలు ఎమ్మెల్యే రాచమల్లుకు వ్యతిరేకంగా వర్గపోరు తీవ్రం చేస్తున్నారు. ఎమ్మెల్యే రాచమల్లు ఎన్నికల ప్రచారం ప్రారంభించక ముందే ఈనెల 11 నుంచే ప్రొద్దుటూరులోని కొత్తపల్లె వివేకానంద కాలనీ నుంచి వీరు ప్రచారం మొదలు పెట్టారు. ఫిబ్రవరి 14న మున్సిపాలిటీలోని 11, 13 వార్డుల్లో వేలాదిమంది కార్యకర్తలతో జగన్ ముద్దు-రాచమల్లు వద్దు అంటూ భారీగా బైక్ ర్యాలీ నిర్వహించి ప్రచారం చేశారు. దీంతో వైసీపీలో అసమ్మతి సెగ వెడెక్కింది.

చర్చలకు వెళ్లని అసమ్మతి నేతలు

దీనికి ఎలాగైనా చెక్‌పెట్టాలని ఎమ్మెల్యే రాచమల్లు ఎంపీ అవినాశ్ ద్వారా అసమ్మతి నేతలను చర్చలకు పిలిచారు. కానీ వారు ఈసారీ మోసపోలేమని చర్చలు వెళ్లకుండా తమ అసమ్మతి ప్రచార హోరును పెంచారు. ఈ అసమ్మతి బెడదతో ప్రజలు, కార్యకర్తల్లో నెలకొనే గందరగోళం నివారించేందుకు ఈనెల 15న ఎమ్మెల్యే రాచమల్లు ఎన్నికల ప్రచారం మొదలు పెట్టారు. ఆ ప్రచార ప్రారంభ కార్యక్రమానికి ఎంపీ అవినాశ్ రెడ్డి, జిల్లా వైసీపీ అధ్యక్షుడు కడప మేయర్ సురేశ్‌బాబు వచ్చారు. దీంతో తనకు అధిష్ఠానం ప్రచారానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లుగా రాచమల్లు పరోక్షంగా ప్రచారం చేసుకుంటున్నారు. అయితే అసమ్మతి నేతలు మరింత పట్టుదలగా తమ బలం ప్రదర్శించేందుకు సోమవారం వేలాది మందితో ప్రొద్దుటూరులోని శ్రీనివాసనగర్ ప్రాంతంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున వారికి స్వాగతం పలికారు. రాచమల్లు పట్ల ఉన్న వ్యతిరేకతకు ఇదే నిదర్శనం అంటూ వారు ప్రచారం చేస్తున్నారు.

వైసీపీలో టికెట్లు ఇంకా ఖరారు కాలేదు

ఉమ్మడి కడప జిల్లాలో రాజంపేట తప్ప మరే నియోజకవర్గం టికెట్లూ వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ఖరారు చేయలేదని, ఎంపీ గానీ సురేశ్‌బాబు గానీ టిక్కెట్లు ఇచ్చేవారు కాదని అసమ్మతి నేతలు పేర్కొంటున్నారు. రాచమల్లు తనకు ఎక్కడ టిక్కెట్టు రాదో అనే ఆందోళన, కార్యకర్తలు ఎక్కడ జారుకుంటారో అనే భయంతో ఎంపీని రప్పించుకుని ప్రచారం చేసుకుంటున్నారని వారు పేర్కొంటున్నారు. ప్రొద్దుటూరులో రాచమల్లు అవినీతి అక్రమాలు భూదందాలు హత్యారాజకీయాల వల్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. అందువల్లే తాము రాచమల్లుకు వ్యతిరేకంగా ఎన్నికల బరిలో నిలబడ్డామనడంతో పెద్ద ఎత్తున తమకు ప్రజల్లో ఆదరణ లభిస్తోందని అంటున్నారు.

ఆయనకే టికెట్టు ఇస్తే ఓడిస్తాం..

ఒకవేళ తమ వాదనలు పరిగణనలోకి తీసుకోకుండా అధిష్ఠానం టిక్కెట్టు ఇస్తే రాచమల్లు ఓటమే లక్ష్యంగా పోరాడతామంటూ అసమ్మతి నేతలు హెచ్చరిస్తున్నారు. పార్టీలో ఒక సలహాదారుడు మాత్రమే రాచమల్లును వెనకేసుకుని రావడం వల్ల ప్రొద్దుటూరులో వైసీపీకి అడ్రస్సు గల్లంతయ్యే అవకాశం ఉందని, ఆ పరిస్థితి నుంచి పార్టీని కాపాడేందుకే తాము ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా రాచమల్లుకు వ్యతిరేకంగా పోరాడుతున్నట్లు చెబుతున్నారు.

అధిష్ఠానం ఆదేశించినా ఆయన తీరు మారలేదు

సొంత పార్టీ సర్పంచ్‌నే దెబ్బతీయడానికి ఎమ్మెల్యే వార్డు మెంబర్లను కోటి రూపాయలు వెచ్చించి సంతలో పశువులను కొన్నట్లు కొన్నారంటూ వైసీపీ అసమ్మతి నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీలో జోక్యం చేసుకోవద్దని అధిష్ఠానం చెప్పినా రాచమల్లు తన ఆధిపత్యాన్ని చాటుకోవాలని నిరంతరం ప్రయత్నాలు చేస్తున్నాడని అతని వైఖరి ఎక్కడా మారలేదని చెబుతున్నారు. ఆఖరికి వార్డు మెంబరు ఉప ఎన్నికలో కూడా పోటీ చేసి ఓటమి చవిచూశాడని వెల్లడిస్తున్నారు.

పార్టీ సస్పెండ్ చేసినా వెనుకాడం..

మున్సిపాలిటీలో కౌన్సిలర్లకు ఏ అధికారం లేకుండా చేసి బావమర్ది, తాను మాత్రమే అధికారం చెలాయిస్తున్నారని అసమ్మతి నేతలు పేర్కొంటున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దగ్గర నుంచి మెజారిటీ కౌన్సిలర్లు తీవ్రమైన అసమ్మతితో ఉన్నారని వారిని నయానా భయానా తాయిలాలతో మభ్యపెట్టి అసమ్మతిని కప్పిపుచ్చేంచుకు ఎన్నో తిప్పలు పడుతున్నారని ఆరోపిస్తున్నారు. రాచమల్లు ఓటమిని చవిచూసే వరకు తాము విశ్రమించేది లేదని ఖరాఖండిగా చెబుతున్నారు. పార్టీ సస్పెండ్ చేసినా వెనుకాడేది లేదని తేల్చిచెబుతున్నారు. అధిష్ఠానం ఆయనకే అనుకూలంగా నిర్ణయం తీసుకుంటే అవసరమైతే పార్టీలో ఉండాలా లేదా అని కూడా తేల్చుకుంటామని వారు హెచ్చరిస్తున్నారు. అందువల్లే రోజురోజుకు అసమ్మతి సెగను తీవ్రతరం చేస్తున్నారు.



రాచమల్లుకు వ్యతిరేకంగా శివచంద్రారెడ్డి నేతృత్వంలో సోమవారం చేపట్టిన ప్రచారం

రేపు చలో అనంతపురం

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ నేతల దాడికి నిరసనగా ర్యాలీ, ధర్నా
- దాడికి పాల్పడ్డ వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి
- ఏపీయూడబ్ల్యూజే డిమాండ్

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 20: రాష్ట్రంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, అలాగే అనంతపురం జిల్లా రాప్తాడులో ఫోటో జర్నలిస్టు శ్రీకృష్ణపై దాడి చేసిన వారి మీద హత్యాయత్నం కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని కోరుతూ 22వ తేదీ గురువారం చలో అనంతపురం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పల్లేటి రామసుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు ఎక్కంటి ఆంజనేయులు, సాయంకాలం ఎడిటర్ వెంకటరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో జర్నలిస్టులపై రోజురోజుకూ దాడులు పెరుగుతున్నాయని, వీటిని అరికట్టాల్సిన పాలకులే దాడులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. మొన్నటికి మొన్న అమరావతిలో ఇసుక రవాణాపై వార్త రాసినందుకు ఈనాడు రిపోర్టర్‌పై, పుట్టపర్తిలో ఈనాడు ఫొటోగ్రాఫర్‌పై, నిన్నరాప్తాడులో సిద్ధం సభ కవరేజీకి వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై అధికార వైసీపీ నేతలు దాడి చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. రాప్తాడులో దాడి చేసి 48గంటలు దాటినా ఇంతవరకు నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి శ్రీకృష్ణపై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం అనంతపురంలో చేపట్టబోయే ర్యాలీ, ధర్నాలో జర్నలిస్టులు పెద్దసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే జర్నలిస్టుల ఉద్యమానికి ప్రజాస్వామిక వాదులు, ఉద్యోగ ప్రజా కార్మిక విద్యార్థి యువజన సంఘాల నేతలు మద్దతు ఇవ్వాలని కోరారు.

ఈనాడు కార్యాలయంపై దాడి అమానుషం

కర్నూలులోని ఈనాడు ప్రాంతీయ కార్యాలయంపై వైసీపీ మూక దాడి అమానుషమని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పత్రికా స్వేచ్ఛను వైసీపీ హరిస్తుందనడానికి ఈ దాడులే నిదర్శనమని తెలిపారు. నిజాలు జీర్ణించుకోలేక నిందలు మోపడం, దాడులకు దిగడం, కొట్టి చంపడం అధికార పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని పేర్కొన్నారు. పత్రికా ప్రతినిధులపై దాడి అంటే ప్రజాస్వామ్యంపై దాడి చేసినట్లే అని తెలిపారు. నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైవీయూకు కేంద్రం నిధులు
రూ.20 కోట్లు మంజూరు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 20: భారత ప్రభుత్వం పీఎం యూఎస్‌హెచ్‌ఏ ద్వారా వైవీయూకు రూ.20 కోట్లు నిధులు మంజూరు చేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పీఎంయూఎస్‌హెచ్‌ఏ ప్రాజెక్టును మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. పీఎం కార్యక్రమం అనంతరం వైవీయూ వీసీ ప్రొఫెసరు చింతా సుధాకర్ మాట్లాడుతూ వైవీయూకు నిధులు విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞలు తెలిపారు. మౌలిక వసతుల కల్పన కోసం 2013లో రాష్ట్రీయ ఉచ్చతర శిక్ష అభియాన్ ప్రారంభించారని, అది ఇప్పుడు ప్రధానమంత్రి ఉచ్చతర శిక్ష అభియాన్‌గా మారిందన్నారు. దీని ద్వారా నిధులు వచ్చాయన్నారు. ఈ నిధుల్లో రూ.12 కోట్లు వెచ్చించి యూనివర్శిటీ ప్రాంగణంలో నూతన ఆడిటోరియం, అకడమిక్ బిల్డింగ్ నిర్మిస్తామని వెల్లడించారు. అలాగే సైన్స్ విభాగంలో పరిశోధనలు ప్రోత్సహించేందుకు రూ.6 కోట్లు ఖర్చు చేసి అత్యాధునిక సైంటిఫిక్ ఎక్విప్‌మెంటు కొనుగోలు చేయనున్నామన్నారు. మరో రూ.2కోట్లను విద్యార్థుల బోధనకు అవసరమైన సాంకేతిక పరికరాలు కొనుగోలుకు ఉపయోగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ వైపీ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి, పీఎంయూఎస్‌హెచ్‌ఏ సమన్వయకర్త చంద్రశేఖర్, విజయకుమార్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ చింతా సుధాకర్

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి



జగన్‌ను ఇంటికి పంపేందుకు
ప్రజలు సిద్ధం

- విలేకరులపై దాడి సిగ్గుచేటు
- మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

వేంపల్లె, ఫిబ్రవరి 20: అరాచక పాలనతో రాష్ట్ర రాజధాని అమరావతిని సర్వనాశనం చేసిన జగన్ సిద్ధం అంటూ సభలు ఎందుకు నిర్వహిస్తున్నారో అర్థం కాలేదని, ప్రజలంతా జగన్‌ను లోటస్‌పాండ్‌కు పంపేందుకు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్సీ బీటెక్‌రవి తెలిపారు. వేంపల్లెలో టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రానికి ముఖ్యమంత్రి జగన్‌తో దరిద్రం పట్టుకుందని, ఈ దరిద్రం ఎప్పుడు పోతుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. రైతులకు ఎలాంటి సహాయం చేయకపోగా డ్రిప్ పరికరాలు ఇవ్వలేదని, ఇన్సూరెన్స్ రాకుండా నాశనం చేశారని, ఇంకా ఏం చేసేందుకు సిద్ధం అని ప్రశ్నించారు. చెల్లెలు షర్మిల, సునీతలను లేపేందుకు సిద్ధమా అన్నారు. జగన్ మద్యంతో రాష్ట్రంలో 25శాతం మంది మద్యం ప్రియులు లివర్లు చెడిపోయే ప్రమాదంలో ఉన్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఇదే విషయాన్ని పక్కరాష్ట్రాలతో పోల్చుతూ ఇటీవల షర్మిల చెప్పారని బీటెక్ రవి గుర్తుచేశారు. వైసీపీపై ప్రజల్లో అసంతృప్తి పెరిగిపోయిందని, దీంతో అసహనంతో వైసీపీ వారు ఏం చేస్తున్నారో అర్థంకాని పరిస్థితుల్లోకి వచ్చారని అన్నారు. విలేకరులపై దాడులు చేయడం సిగ్గచేటన్నారు. విలేకరుల సమావేశంలో మండల పరిశీలకులు రఘునాథ రెడ్డి, కన్వీనర్ మునిరెడ్డి, షబ్బీర్, దర్బార్, జయచంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆర్వీ రమేశ్, ఉపాధ్యక్షుడు భద్ర, మైనార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పూల బక్షు తదితరులు పాల్గొన్నారు.

నాధనాగేశ్వరుని కొండ అగ్నికి ఆహుతి

ఖాజీపేట, ఫిబ్రవరి 20: ఖాజీపేట మండల పరిధిలోని నాధనాగేశ్వరుని కొండ అగ్నికి ఆహుతి అవుతోంది. ఖాజీపేట హైవేకి మూడు కిలోమీటర్ల దూరంలో నాధనాగేశ్వరుని కొండ ఉంది. మూడు రోజులుగా కొండపేట బీట్ మొదలుకొని నాగసానిపల్లె బీట్ వరకు కొండ కాలుతోంది. భారీగా మంటలు ఎగిసిపడుతున్నాయి. అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో ఎన్నో జీవరాశులు మంటల్లో కాలిపోతున్నాయి. ఈ లంకమల్ల అడవిలో ఉన్న జింకలు, దుప్పులు, కుందేళ్లు, నెమళ్లు చనిపోయే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంటలు ఆర్పకుంటే కొండప్రాంతంలోని పంట పొలాల్లోకి కూడా మంటలు వ్యాపించే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఫారెస్టు అధికారులను వివరణ కోరగా నాగేశ్వరుని కొండ తమకు సంబంధం లేదని, అది రెవెన్యూ వారికి సంబంధమని పేర్కొన్నారు.



నాధనాగేశ్వరుని కొండ పైభాగంలో ఎగిసి పడుతున్న మంటలు



కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు

దాచుకున్న సొమ్ము
దోచుకుని పంచారు

- డిమాండ్లను పరిష్కరించకపోతే చలో విజయవాడకు సిద్ధం
- ఉద్యోగులతో పెట్టుకున్న ప్రభుత్వాలకు మనుగడే లేదు
- మహాధర్నాలో ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 20: ఉద్యోగులు ఏళ్ల తరబడి దాచుకున్న సొమ్మును దోచి పథకాలకు పంచడంతో బిడ్డల చదువులు, పెళ్లిళ్లకు కష్టాలు తప్పలేదని ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ శివారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులతో పెట్టుకున్న ప్రభుత్వాలకు మనుగడ ఉండదని గత ఎన్నికలు నిరూపించాయని హెచ్చరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల డిమాండ్ల సాధనలో భాగంగా ఏపీ జేఏసీ ఐక్యకార్యాచరణ పిలుపు మేరకు మంగళవారం మహావీర్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు అన్నమయ్య, కడప జిల్లాల ఉద్యోగులు ర్యాలీ నిర్వహించి మహాధర్నా చేపట్టారు. జేఏసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన మహాధర్నాలో కేవీ శివారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాలనలో 11వ పీఆర్సీని మూడేళ్లు సాగదీసి తక్కువ చేశారని, కరోనా సాకుతో రివర్స్ పీఆర్సీతో సర్దుకుపోయామన్నారు. పక్క రాష్ట్రాల్లో పెన్షనర్లకు 75 ఏళ్లు దాటితే పెన్షన్‌లో అదనంగా 15 శాతం ఇస్తుంటే మన రాష్ట్రంలో కోత పెట్టారన్నారు. ఉద్యోగులకు, పెన్షనర్లకు సకాలంలో జీతాలు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామన్నారు. బ్యాంకులకు ఈఎంఐలు కట్టని కారణంగా సిబిల్ స్కోరు తగ్గి రుణాలివ్వడం లేదన్నారు. ఉద్యోగుల సొమ్ము దాదాపు 30, 40 వేల కోట్లు దోచి, పథకాలకు పంచారని ఆరోపించారు. ఉద్యోగులు గొంతెమ్మ కోరికలు కోరడం లేదన్నారు. వైఎస్ జగన్ ప్రతిపక్ష నేతగా సీపీఎస్ రద్దు చేస్తామని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని చెప్పారన్నారు. వెంటనే 12వ పీఆర్సీతో పాటు ఐఆర్ 30 శాతం, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే చలో విజయవాడ ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులు, పెన్షనర్లు, కార్మికులు, ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగులు దాదాపు 15లక్షల మంది ఉన్నారన్నారు. ప్రతి ఉద్యోగి కుటుంబంలో ఐదారు ఓట్లు ఉంటాయన్నారు. ఆ లెక్కన 75-80లక్షల మంది వచ్చే ఎన్నికల్లో అధికారపార్టీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ డ్రైవర్ల సంఘ అధ్యక్షుడు కొండయ్య, ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర నాయకులు లక్ష్మీరెడ్డి, ఇలియాస్, జేఏసీ నాయకులు తిమ్మారెడ్డి, నిత్యపూజయ్య, నరసింహారెడ్డి, కాటమయ్య, భూషణం, పద్మనాభరావు, నిర్మలా జ్యోతి, నాగార్జున, బాలయ్య, రాజగోపాల్, అన్ని తాలూకాల అధ్యక్షులు, కార్యదర్శులు, ఉద్యోగులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

- ఫ్లయింగ్ స్క్వాడ్ అప్రమత్తంగా ఉండాలి
- ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి
- శిక్షణలో జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు

కడప(రూరల్), ఫిబ్రవరి 20: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రానున్న సాధారణ ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంతంగా, సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. మంగళవారం జిల్లా పరిషత్ సభాభవనంలో నగర కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ ఆధ్వర్యంలో 2024 సాధారణ ఎన్నికలకు సంబంధించి ఈఆర్‌వోలు, సబ్‌డివిజన్ పోలీస్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, స్టాటిస్టిక్ సర్వైలెన్స్ టీమ్స్, వీడియో సర్వైలైన్స్ టీమ్, వీడియో వ్యూవింగ్ టీమ్స్‌కు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ కొన్ని రోజుల్లోనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుందని, జిల్లాలో ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి అధికారి సంసిద్ధం కావాలన్నారు. ఎన్నికల విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బంది ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పక పాటించాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన 24 గంటల్లోనే పార్టీలకు సంబంధించిన గుర్తులు, రాజకీయ పార్టీల నేపథ్యం ఉన్న వ్యక్తుల ఫొటోలను ఆయా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు, పబ్లిక్ ప్రదేశాల్లో పూర్తిగా తొలగించాలన్నారు. ఎన్నికల విధినిర్వహణలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు చిత్తశుద్ధితో బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. అనంతరం అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అదనపు ఎస్పీ(అడ్మిన్) లోసారి సుధాకర్ ఎన్నికల ప్రవర్తన నియమావళిపై సిబ్బందికి అవగాహన కల్పించారు. జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్, జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి ఎ.ప్రభాకర్‌రెడ్డి, మెప్మా పీడీ సురేశ్‌రెడ్డి, జిల్లా ఉపాధి కల్పనా అధికారి సురేశ్‌కుమార్ తదితరులు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా డీఎస్పీలు, పోలీస్ సిబ్బంది, ఎన్నికల విధులకు హాజరయ్యే వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలి : ఆర్జేడీ

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 20: పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని ఆర్జేడీ వై.రాఘవరెడ్డి సూచించారు. అలాగే విద్యాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ సభాభవనంలో పది పరీక్షలపై ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నాయన్నారు. నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని అమలు చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. అలాగే సబ్జెక్టు ఉపాధ్యాయులు విద్యార్థులను దత్తత తీసుకోవాలని తెలిపారు. ఏ, బీ గ్రేడ్ విద్యార్థులు పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించేలా తర్ఫీదు ఇవ్వాలన్నారు. సీ, డీ గ్రేడ్ విద్యార్థులకు సూక్ష్మ ప్రశ్నలకు సమాధానాలు రాయడంతో పాటు ఉత్తీర్ణత పొందేలా శిక్షణ కల్పించాలని సూచించారు. ప్రతిరోజూ సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహించాలని తెలిపారు.



పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య


విశ్వనాథరెడ్డి (ఫైల్)

రామాపురం, ఫిబ్రవరి 20: మండలంలోని హసనాపురం పంచాయతీ కుమ్మరపల్లె చెందిన కొవ్వూరి విశ్వనాథ్‌రెడ్డి (75) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. రాయచోటిలో ఉంటున్న తన కూతురు ఇంటికి వెళ్లిన విశ్వనాథరెడ్డి మంగళవారం రాయచోటి నుంచి ఆటోలో హసనాపురానికి వచ్చాడు. ఇంటికి వెళ్లకుండా తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ వివరించారు. తన భార్యకు ఇటీవలే చెయ్యి విరగగా, సమీప బంధువులు ఎవరూ దగ్గరకు తీయకపోవడంతో మనస్థాపం చెందినట్లు పోలీసులు తెలిపారు. రామాపురం పోలీసులు మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య

ముద్దనూరు ఫిబ్రవరి 20: భర్త వేధింపు తాళలేక మంగళవారం ఉదయం కట్టుబోడి షబానా (29) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ దస్తగిరి తెలిపారు. సీఐ సమాచారం మేరకు... పులివెందుల రోడ్డులోని టీవీఎస్ షోరూం వెనుక వీధిలోని ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇనుప కొక్కీకి చీరెతో ఉరి వేసుకుంది. మూడు సంవత్సరాల క్రితం యల్లనూరుకు చెందిన షబానాకు ముద్దనూరుకు చెందిన మహమ్మద్‌బాషాతో వివాహమైంది. భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు షబానా తల్లదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

15 మద్యం సీసాలు స్వాధీనం

రామాపురం, ఫిబ్రవరి 20: మండలంలోని గువ్వలచెరువులో మూడే భాస్కర్‌నాయక్ అనే వ్యక్తిని అరెస్టు చేసి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఎల్‌వీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. కొన్ని రోజులుగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో మంగళవారం దాడులు నిర్వహించామని వివరించారు.

గండి నిత్యాన్నదాన పథకానికి విరాళం


దాతలకు పత్రం అందిస్తున్న ముకుందరెడ్డి

చక్రాయపేట, ఫిబ్రవరి 20: గండి క్షేత్రంలో నిర్వహించే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి పలువురు దాతలు విరాళం అందించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో అందించిన దాతల వివరాలు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుంద రెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజలు తెలియజేశారు. యర్రగుంట్లకు చెందిన జక్కు తులశమ్మ కుమారుడు చెన్న కృష్ణారెడ్డి రూ.25 వేలు, మైదుకూరుకు చెందిన యాపరాల అన్నయ్య రూ.25,116, రాజంపేటకు చెందిన నల్లపునేని మనోహరమ్మ రూ.20,116 అందించినట్లు తెలిపారు. వారికి స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించినట్లు వారు తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

● స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో డీఈవో అనురాధ


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 20 : ఉపాధ్యాయులు కాంప్లెక్స్ సమావేశాల్లో తప్పనిసరిగా శిక్షణ పొందాలని.. పొందిన శిక్షణను తరగతి గదిలో అమలు చేయాలని డీఈవో మారెడ్డి అనురాధ ఆదేశించారు. మంగళవారం కడప నగరం మున్సిపల్ హైస్కూలు మెయిన్‌లో జరుగుతున్న కాంప్లెక్స్ సమావేశాలను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి నెలా జరుగుతున్న కాంప్లెక్స్ సమావేశాలు ఎంఈవోలు, కాంప్లెక్స్ చైర్మన్ ఆధ్వర్యంలో కేటాయించిన షెడ్యూలు ప్రకారం నిర్వహించాలన్నారు. శిక్షణ సమయంలో ఉపాధ్యాయులకు సెలవు కానీ, పర్మిషన్లు కానీ ఇవ్వకూడదని ఎంఈవోలను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులను ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంఈవో పాలెం నారాయణ, హెచ్‌ఎం నాగమణి, మునిరత్నమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయితీ ధరపై శెనగ బేడలు, గోధుమపిండి



భారత్ ప్రాడక్ట్ విక్రయిస్తున్న దృశ్యం

కడప (ఎన్టీఆర్ సర్కిల్), ఫిబ్రవరి 20 : రాయితీ ధరపై శెనగ బేడలు, గోధుమపిండి విక్రయిస్తున్నట్లు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ వ్యాపార కార్యనిర్వాహకులు ఎస్.ఖాదర్‌వల్లి తెలిపారు. స్థానిక డీసీఎంఎస్ కాంప్లెక్స్‌లో మంగళవారం భారత్ శెనగబేడలు, భారత్ గోధుమపిండి విక్రయాలను డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖాదర్‌వల్లి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న భారత్ శెనగబేడలు కిలో 60 రూపాయలు, గోధుమపిండి రూ.27.50 వంతు విక్రయిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని ప్రజలు నాగరాజుపేట, అరుణాచల ఆసుపత్రి సమీపంలో ఉన్న డీసీఎంఎస్ కౌంటరులో కొనుగోలు చేయవచ్చన్నారు. ఆధార్‌కార్డుకు కిలో శెనగ పప్పు, ఐదు కిలోల గోధుమపిండి తీసుకునే సౌలభ్యం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సహకారశాఖ అసిస్టెంటు రిజిస్ట్రార్ వైఎస్ సత్యానందం, సహకారశాఖ సిబ్బంది అధికారులు, డీసీఎంఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంతుచిక్కని వ్యాధితో గొర్రెల మృతి

● లక్షల్లో నష్టపోయిన రైతులు


వ్యాధితో మృతి చెందిన గొర్రె

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 20: అంతుచిక్కని వ్యాధి కారణంగా ఉన్నట్లుండి తల వాలేసి గొర్రెలు మృతి చెందుతున్నాయని మండలంలోని గొర్రెల కాపరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కుర్నూతల, దేవళంపల్లె, అగ్రహారం, పందిళ్లపల్లెల్లో 20 రోజులుగా ఈ పరిస్థితి నెలకొందని అంటున్నారు. దేవళంపల్లెకు చెందిన వీరాంజనేయులు అనే రైతు మాట్లాడుతూ చనిపోయిన గొర్రెలను పరీక్షించగా దొమ్మపై పుండ్లు, గుండెకు కంతలు ఉన్నాయని తెలిపారు. ఇది ఏ వ్యాధి లక్షణమో పశువైద్యాధికారులు కూడా చెప్పడం లేదన్నారు. ఈ మధ్యకాలంలో దేవళంపల్లెకు చెందిన కొత్తపల్లె వీరాంజనేయులు, పల్లా రామ్మోహన్ కొత్తపల్లె రామాంజనేయులు, రామిరెడ్డికి చెందిన గొర్రెలు మృతి చెందాయని ఒక్కో గొర్రె ఖరీదు 15 వేల నుంచి 18 వేలు ఉంటుందని తెలిపారు. పశువైద్యాధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని, గోపాలమిత్రలు వచ్చినా, సరైన మందులు ఇవ్వకపోగా మందులు కొని తెచ్చుకోవాలని చెబుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిగిలిన గొర్రెలకు పరీక్షలు నిర్వహించి చనిపోకుండా చూడాలని బాధితులు కోరుతున్నారు.

డ్రాయింగ్ పోటీల్లో సీకే దిన్నె విద్యార్థికి మొదటి బహుమతి


విద్యార్థి హర్షవర్ధన్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సికెదిన్నె, ఫిబ్రవరి 20: 35వ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి.హర్షవర్ధన్ మొదటి బహుమతి గెలుచుకున్నట్లు ఉపాధ్యాయులు గురవయ్య తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆరు నుండి 9వ తరగతి విద్యార్థులకు జిల్లాస్థాయి డ్రాయింగ్, ఎస్సే రైటింగ్, క్విజ్ పోటీలను రవాణాశాఖ నిర్వహించగా తమ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి హర్షవర్ధన్ డ్రాయింగ్ పోటీల్లో మొదటి బహుమతి గెలుచుకున్నారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభారాణి, మండల విద్యాశాఖాధికారులు వెంకటరామిరెడ్డి, రమాదేవి, తదితరులు, విద్యార్థులు అభినందించారు.

ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో..

● వ్యవసాయానికి విద్యుత్ కోతలతో సతమతం
● ఒకరోజు 5 గంటలకు.. మరో రోజు ఉదయం 8 గంటలకు
● ఏడు గంటలు ఇస్తారో.. తొమ్మిది గంటలు ఇస్తారో తెలియని దుస్థితి

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారింది. వారం పది రోజులుగా ఎప్పుడు విద్యుత్ వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక రైతులు సతమతమవుతున్నారు. తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా కాకుండా ఏడు గంటలకు కుదించారు. అది కూడా లైన్ కట్ పేరుతో సరఫరా సమయంలో కోతలు పెట్టడం రైతులను కలచివేస్తోంది. ఒకరోజు ఏడు గంటలు మరో రోజు తొమ్మిది గంటలు ఇలా సరఫరా సాగుతోంది.




బోరుబావుల కింద సాగైన నూగు పంట

పులివెందుల, ఫిబ్రవరి 20: ఈ ఏడాది వ్యవసాయం రైతులకు దయనీయంగా మారింది. అటు ఖరీఫ్ ఇటు రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలు కాస్త వర్షాలు లేక తుడిచిపెట్టుకుపోయాయి. కనీసం బోరు బావుల కింద అయినా పంటలు సాగుచేసి దిగుబడులు తీసుకుందామనుకుంటే విద్యుత్ కోత రైతుకు సమస్యగా మారింది. వారం పది రోజులుగా విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా ఉంది. గతంలో విద్యుత్ సరఫరా సమయంలో ఎలాంటి కోతలేకుండా ఇచ్చేవారు. అది కూడా తెల్లవారుజామున 5 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు అందిస్తూ వచ్చారు. ప్రస్తుతం తెల్లవారుజామున 5గంటలకు సరఫరా చేయాల్సిన కరెంటును ఉదయం 8గంటలకు ఇస్తున్నారు. 8గంటల నుంచి 3గంటల వరకు సరఫరా చేయాల్సి ఉంది. మధ్యలో 11:30గంటలకో 12గంటలకో ఎల్ఆర్ పేరుతో గంట నుంచి రెండు గంటల పాటు కోత విధిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున 5గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ అందించారు. మళ్లీ సోమవారం తెల్లవారుజామున 5గంటలకు విద్యుత్ సరఫరాచేశారు. 5గంటల నుంచి 6:30గంటల వరకు విద్యుత్ ఉంది. తర్వాత 8గంటల వరకు ఎల్ఆర్ పేరుతో కోత విధించారు. 8 నుంచి 12గంటల వరకు సరఫరా కాగా మళ్లీ 12 నుంచి గంటన్నర పాటు కోత విధించారు. ఇలా ఎప్పుడు పడితే అప్పుడు సరఫరా చేయడం ఎల్ఆర్ పేరుతో కోత విధించడం విద్యుత్ అధికారులకు పరిపాటిగా మారింది. ఇదేమని అడిగితే పై అధికారుల సూచనల మేరకే సరఫరా చేస్తామని ఆయా సబ్‌స్టేషన్లలో చెబుతున్నట్లు రైతులు వాపోతున్నారు. గతంలో లాగా తెల్లవారుజామున 5గంటల నుంచి లేదా ఉదయం 8గంటల నుంచి విద్యుత్ సరఫరా చేయాలని అది కూడా 7 గంటలు ఇస్తారా.. 9గంటలు ఇస్తారా అనేది ముందే తెలియజేస్తే తాము ఆ ప్రకారం పంటలకు నీటి సరఫరా చేసుకుంటామని రైతులు అంటున్నారు. ఒక రోజు తెల్లవారుజామున 5గంటలకు ఇవ్వడం మరునటి రోజు ఉదయం 8గంటలకు ఇవ్వడం కాకుండా.. ఒక వారం 5 గంటలకు మరో వారం 8గంటలకు ఇవ్వాలని రైతులు అంటున్నారు.

ప్రస్తుతం బోరుబావుల కింద ఉద్యాన పంటలైన చీనీ, అరటి సాగులో ఉన్నాయి. వాటితో పాటు కొర్ర, వేరుశనగ, పత్తి, నూగు, మిరప తదితర పంటలు బోరుబావుల కింద సాగు చేశారు. ఈ పంటలకు నీటితడులు అందించేందుకు పొలాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. ఏ సమయానికి విద్యుత్ అందిస్తారో ఎన్నిగంటలు ఇస్తారో ముందే తెలియజేయాలని రైతులు విద్యుత్ అధికారులను కోరుతున్నారు.

పేరు జాస్తి.. వైద్యం నాస్తి

● కనిపించని డాక్టర్ ● అన్నింటికీ స్టాఫ్ నర్సే గతి ● అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఇదీ దుస్థితి


అర్బన్ హెల్త్ సెంటర్‌లో తెరుచుకోని తలుపులు

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 20: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన అర్బన్ హెల్త్ సెంటర్లలో డాక్టర్లు లేక వెలవెలపోతున్నాయి. ఒక డాక్టరు, ఒక స్టాఫ్ నర్సు, ఇద్దరు అసిస్టెంట్స్, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఇద్దరు సిబ్బంది ఉండాలి. ఇక్కడ మాత్రం కేవలం ఒకే ఒక్క స్టాఫ్ నర్సు ఉన్నారు. ప్రజల ఇంటిముంగిటకే వైద్యం అందుబాటులో ఉంచామంటూ ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్నా.. ఇక్కడ వైద్యం మాత్రం అందకపోవడం విమర్శలకు తావిస్తోంది.

రాయచోటిలోని ఎస్ఎన్ కాలనీకి చెందిన 16వ వార్డు అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్యుడు, సిబ్బంది లేకపోవడంపై పలు రకాల విమర్శలు వినపడుతున్నాయి. ఉదయం 11 గంటలకే అర్బన్ హెల్ సెంటర్‌లో డాక్టర్లు లేకపోవడం చాలా విచిత్రంగా ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అధునాతన పరికరాలతో హెల్త్ సెంటర్లు నిర్మించి ప్రజల ముంగిటకే వైద్యం చేరవేశామంటూ ఆర్భాటంగా చేస్తున్న ప్రకటనలు కేవలం ప్రకటనలకే పరిమితం అవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ పని చేస్తున్న వారిలో ఇద్దరు క్యాజువల్ లీవ్‌లో ఉన్నారు. మిగిలిన వారిలో ముగ్గురు విధులకు రావడం లేదని తెలిసింది. దాదాపు 30 వేల జనాభాకు సేవలు అందించాల్సిన ఈ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో కేవలం ఒకే ఒక్క స్టాఫ్ నర్సు ఉండడం, మిగిలిన గదులకు తాళాలు వేసి ఉండడం రోగులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఇక్కడ రెగ్యులర్ డాక్టర్‌ను ఏర్పాటు చేసి వైద్యం అందేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అధికారి ఏమన్నారంటే..

ఈ విషయంపై డీపీయం రియాజ్‌బేగ్‌ను వివరణ కోరగా.. ఈ వ్యవహారం తన దృష్టికి వచ్చిన వెంటనే అర్బన్ హెల్త్ సెంటర్‌కు వెళ్లి చూశానన్నారు. అక్కడ ఒక్క స్టాఫ్ నర్సు మాత్రమే ఉన్నారన్నారు. మిగిలిన వారు ఎందుకు రావడం లేదో తెలియదని, వారికి సంజాయిషీ నోటీసులు ఇస్తామన్నారు.

260 పరుగుల ఆధిక్యంలో రైల్వేస్ జట్టు


అన్షుయాదవ్, రైల్వేస్ (235)


రవిసింగ్, రైల్వేస్ (258)


అంచిత్‌యాదవ్, రైల్వేస్ (117)

కడప (స్పోర్ట్స్), ఫిబ్రవరి 20 : కల్నల్ సీకే నాయుడు ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ఆంధ్రా-రైల్వేస్ జట్ల మధ్య జరుగుతున్న నాలుగు రోజుల క్రికెట్ మ్యాచ్‌లో మూడవ రోజు ఆట ముగిసే సమయానికి రైల్వేస్ జట్టు 260 పరుగుల ఆధిక్యత సాధించింది.

తొలుత టాస్ నెగ్గిన ఆంధ్రా జట్టు బ్యాటింగ్‌కు దిగి మొదటి ఇన్నింగ్స్‌లో 93.5 ఓవర్లలో 378 పరుగులు సాధించింది. ఇందులో ఎం.వంశీకృష్ణ 110 పరుగులు చేయగా ధరణికుమార్ నాయుడు 81 పరుగులు, టి.వంశీకృష్ణ 55 పరుగులు, ఎస్.వెంకటరాహుల్ 61 పరుగులు చేసి జట్టు భారీ స్కోర్‌కు బాటలు వేశారు.

అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రైల్వేస్ జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 174 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 638 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఇందులో రవిసింగ్ (బ్యాటర్) 258 పరుగుల భారీ స్కోర్ చేయగా, మరో బ్యాటర్ అన్షుయాదవ్ 235 పరుగులతో, అంచిత్‌యాదవ్ 117 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు. దీంతో రైల్వేస్ జట్టుకు 260 పరుగులు ఆధిక్యత లభించింది. బుధవారం చివరిరోజు ఆట జరగనుంది.

ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలి

● ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి


శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

కడప (మారుతీనగర్) ఫిబ్రవరి 20 : ఆర్టీసీ బస్సులలో ప్రయాణం చేసే ప్రయాణీకుల పట్ల డ్రైవర్లు మర్యాదపూర్వకంగా ఉండాలని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పి.గోపాల్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక డీపీటీఓ కార్యాలయంలో ప్యాసింజర్ కంప్లైంట్, బిహేవియర్ ఆఫ్ క్రూ యాక్సిడెంట్ ప్రోన్ డ్రైవర్స్ డ్రంకన్ డ్రైవర్స్ అత్యల్ప ఇంధన పొదుపు డ్రైవర్స్‌కు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సు నడిపే డ్రైవర్ చేతిలో సుమారు 40 నుంచి 50 మంది ప్రయాణీకుల ప్రాణాలు ఉన్నాయనే సంగతిని మరువరాదన్నారు. వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే బాధ్యత ప్రతీ ఆర్టీసీ డ్రైవర్‌కు ఉందన్నారు. సంస్థ పురోగతికి కారకులైన డ్రైవర్లు బాధ్యతగా.. మంచి అలవాట్లను పాటించి వారి ఆరోగ్యాలతో పాటు ప్రయాణీకుల ప్రాణాలకు భరోసా కల్పించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో రీజనల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ సుధాకృష్ణారెడ్డి, కడప సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ జి.రామయ్య, పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం మేనిఫెస్టోలో చేర్చండి


శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 20: రాబోవు ఎన్నికల్లో టీడీపీ ప్రకటించబోయే మేనిఫెస్టోలో పాత పెన్షన్ విధానం పునరుద్ధరిస్తామనే హామీని చేర్చేవిధంగా రాష్ట్ర నాయకత్వంపై ఒత్తిడి తేవాలని యూటీఎఫ్ ప్రతినిధులు కోరారు. మంగళవారం కడపలోని శ్రీనివాసరెడ్డి నివాసంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టీడీపీ ప్రకటించబోయే మేనిఫెస్టోలో సీపీఎస్ విధానాన్ని పునరుద్ధరిస్తూ అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి సంతకం చేసే విధంగా టీడీపీ ప్రకటించాలని కోరారు. ఏ రాజకీయ పార్టీ అయితే పాత పెన్షన్ పునరుద్ధరిస్తామని హామీ ఇస్తుందో వారికే రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ ఓట్ ఫర్ ఓపీఎస్ అనే నినాదం ద్వారా మద్దతు పలుకుతామని తెలిపారు. టీడీపీ రాష్ట నాయకత్వం దృష్టికి పాత పెన్షన్ విధానాన్ని తీసుకెళ్లిమేనిఫెస్టోలో చేర్చే విధంగా చొరవ చూపాలని శ్రీనివాసరెడ్డిని కోరారు. ఆయన స్పందిస్తూ పాత పెన్షన్ పునరుద్ధరణకు చర్యలు తీసుకునే విధంగా రాష్ట్ర నాయకత్వంపై ఒత్తిడి తీసకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎజాజ్ అహ్మద్, నాయకులు గోపినాద్, అబ్దుల్ గని, వెంకటరమణ, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాలగంగిరెడ్డి


బాలగంగిరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సికెదిన్నె, ఫిబ్రవరి 20: ఎస్టీయూ 77వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కంభం బాల గంగిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగిన సమావేశంలో బాలగంగిరెడ్డిని ఏకగ్రీవంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకోవడంతో ఆయన సహచరులు, మిత్రులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన పనిచేస్తున్న చింతకొమ్మదిన్నె మండలం కొలుములపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తోటి ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేసి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసులు, వీరేంద్ర, నారాయణరెడ్డి, నాగప్రకాశ్ రావు, మాదవి, జేవీ సుబ్బరాయుడు, భారతి, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 అభ్యర్థుల కోసం కంట్రోల్ రూమ్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 20: జిల్లాలో ఈనెల 25న జరగబోయే గ్రూప్-2 పరీక్ష రాసే అభ్యర్థుల కోసం కలెక్టరేట్‌లో ఈనెల 23 నుంచి 25 వరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయబోతున్నట్లు కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష రాయబోయే అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవడంలో ఎటువంటి ఇబ్బంది తలెత్తినా 0851-293006 నెంబరుకు కాల్ చేస్తే కంట్రోల్ రూమ్ వారు సహకరిస్తారని తెలిపారు.

ఇంటి స్థల విషయమై ఘర్షణ

8 మందిపై కేసు నమోదు

గుర్రంకొండ, ఫిబ్రవరి 20: ఇంటి స్థలం విషయమై ఇరువర్గాలు ఘర్షణపడడంతో 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. ఆయన వివరాల మేరకు... మండలంలోని రామాపురం పంచాయతీ నక్కలవారిపల్లెకు చెందిన ఇ.వెంకటరమణకు అదే గ్రామానికి చెందిన ఎం.నరేష్‌బాబుకు ఇంటి స్థల విషయమై కొంత కాలంగా గొడవలున్నాయి. ఈ క్రమంలో స్థలంలో మంగళవారం వెంకటరమణ కూసాలు నాటుతుండగా నరేష్‌బాబు కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. ఈ గొడవలో వెంకటరమణ, యల్లప్పలకు గాయాలయ్యాయి. వెంకటరమణ ఫిర్యాదు మేరకు ఎం.నరేష్‌బాబు, సుబ్బరాజు, జయతులసీ, సునీల్‌కుమార్‌లపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే నరేష్‌బాబు ఫిర్యాదు మేరకు వెంకటరమణ, ఇంద్రావతి, యల్లప్ప, భారతిలపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సంక్షేమం సాధ్యం

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 20: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుతోనే అభివృద్ధి సంక్షేమం సాధ్యమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి, జనసేన కోఆర్డినేటరు సుంకరశ్రీనివాస్ తెలిపారు. బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీలో భాగంగా మంగళవారం 31వ డివిజన్‌లో పాత మహిళా పోలీసుస్టేషన్ నుంచి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే పథకాల గురించి వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఎక్కడ చూసినా కబ్జాలు, దురాక్రమణలే జరుగుతున్నాయన్నారు. ప్రజలందరూ ఒక్కసారి గమనించి రాష్ట్రం సుభిక్షంగా, శాంతియుతంగా ఉండాలంటే చంద్రబాబును గెలిపించాలని స్పష్టం చేశారు. టీడీపీ నాయకులు నాయబ్, శివకొండారెడ్డి, ఇస్మాయిల్, జిలానీబాషా, గౌస్, షియావుద్దీన్, జమీల్, శ్రీనాథ్, మున్నా, బాబ్జి, ఖాదర్, సమీర్ పాల్గొన్నారు.

టీడీపీలో భారీగా చేరికలు : కడప నగరంలో 2వ డివిజన్‌లో టీడీపీలోకి అధిక సంఖ్యలో స్థానికులు చేరారు. వారికి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌మాధవీరెడ్డిలు టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం : కడప నగరం 2వ డివిజన్‌లో 1 నుంచి నాలుగు డివిజన్లకు సంబంధించిన పార్టీ కార్యాలయాన్ని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గం నుంచి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. టీడీపీ అధికారంలోకి రావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారన్నారు. శివకొండారెడ్డి, హనుమంతు, శ్రీను, శివరాం, రమణయ్య, చిన్నయ్య, శ్రీను, తేజ, మహేష్, శివ, శ్రీకాంత్, నాగసుబ్బన్న, సుధా, క్రిష్ణరెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు ఎందుకు పంపిణీ కాలేదు

● మాధవీరెడ్డి సెల్ఫీ ఛాలెంజ్

కడప నగరంలో చంద్రబాబు ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్లను వైసీపీ ప్రభుత్వం ఎందుకు పంపిణీ చేయలేదని టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి ప్రశ్నించారు. మంగళవారం టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద ఆమె సెల్ఫీ తీసుకుని ఛాలెంజ్ చేశారు. జగన్‌రెడ్డి సొంత జిల్లాలో ఇటువంటి ఇళ్లు ఒక్కటైనా కట్టారా అని ప్రశ్నించారు. ఇటువంటి నాణ్యత ఏ ఇంటికైనా ఉందా అని ప్రశ్నించారు. ఇది టీడీపీ ప్రభుత్వం చేసిన నిర్మాణమని, ఇలాటి నిర్మాణం మీరు చేశారా అని సెల్ఫీఛాలెంజ్ చేశారు.

వేంపల్లెలో పలువురు టీడీపీలో చేరిక

వేంపల్లె, ఫిబ్రవరి 20: భవిష్యత్తులో టీడీపీదే అధికారమని.. ప్రజలంతా అండగా ఉండాలని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి విజ్ఞప్తి చేశారు. వేంపల్లెలోని పిరమిడ్ నగర్, పులివెందుల రోడ్డు, చర్చిలైన్ తదితర ప్రాంతాలలో ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ కార్యక్రమంలో భాగంగా కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీకి ఓటు వేయాలని బీటెక్ రవి అభ్యర్థించారు. పలుచోట్ల ముస్లిం యువకులు టీడీపీలో చేరారు. గండి దేవస్థాన మాజీ చైర్మన్, ఇడుపులపాయ వెంకటస్వామి ఇంటికెళ్లి బీటెక్ రవి చర్చించి.. యదావిధిగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.



కడప : బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీలో మాధవీరెడ్డి, సుంకరశ్రీనివాస్



వేంపల్లె : బీటెక్ రవి సమక్షంలో టీడీపీలో చేరుతున్న ముస్లిం మైనార్టీ యువకులు

కార్యక్రమంలో టీడీపీ నేతలు బాలస్వామిరెడ్డి, రామగంగిరెడ్డి, మడక శ్రీనివాసులు, నామా వేమకుమార్, మహబూబ్ షరీఫ్, గోటూరు నాగభూషణం, ఓబుల్‌రెడ్డియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో అందరూ అభివృద్ధి చెందాలి

కడప (ఎన్జీఆర్ సర్కిల్), ఫిబ్రవరి 20: సమాజంలో ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందాలని టీడీపీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రపంచ న్యాయదినాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. టీడీపీ సామాజిక న్యాయం కోసం ఏర్పడిందన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆ పార్టీ ఎంతగానో కృషి చేసిందని వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అభ్యుదయ చైతన్యవేదిక అధ్యక్షుడు చీపాటి రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సామాజిక న్యాయం అవసరమని, సమాజంలో అందరికీ సమాన అవకాశాలు కలగాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు గురప్ప, అఖిలపక్ష నాయకులు సీఆర్వీ ప్రసాద్, లోక్‌సత్తా నాయకులు దేవర శ్రీకృష్ణ, ఎమ్మార్పీఎస్ నాయకులు బీసీ గంగులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఓటుహక్కుతో కాపాడవచ్చు

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 20: రోజురోజుకు దిగజారిపోతున్న ప్రజా స్వామ్య విలువలను ఓటుహక్కుతో కాపాడుకోవచ్చని పులివెందుల ఆర్డీఓ వెంకటేశులు విద్యార్థినులకు సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాల క్రీడా మంత్రిత్వశాఖ, నెహ్రూ యువకేంద్రాల సహకారంతో స్నేహిత అమృత హస్తం సేవా సమితి ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. కార్యక్రమానికి హాజరైన ఆర్డీఓ మాట్లాడుతూ అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు పొందాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా సరైన మార్గంలో ఓటు వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థినులచే ప్రతిజ్ఞ చేయించి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్‌బాబు, డీటీ జగదీష్, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపల్ సుధీర, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీఓ వెంకటేశులు

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 20: పట్టణంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులచే మదర్‌థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దారు సుబ్రమణ్యం పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కు ఓటు శక్తివంతమైన ఆయుధమన్నారు. మున్సిపల్ కమిషనర్ రాముడు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం అని.. ఓటు వేయకుంటే నీ భవిష్యత్తు శూన్యమన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలన్నారు. ఈ ర్యాలీలో విద్యార్థులచేత ప్రతిజ్ఞ చేయించారు. మదర్‌థెరిసా సేవా సమితి ట్రస్టు చైర్మన్ విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దారు అహల్య, ఆర్ఐ అర్జున్, వీఆర్వోలు, కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరం

● మున్సిపల్ అడిషనల్ కమిషనర్ రాకేశ్ చంద్ర

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 20: విద్యార్థులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కడప మున్సిపల్ అడిషనల్ కమిషనర్ కె.రాకేశ్‌చంద్ర తెలిపారు. మంగళవారం డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ పీవో వి.రమాదేవి ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రత్యేక శిబిరంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి పేదలకు సేవ చేయడం అభినందనీయమని తెలిపారు. డీసీబీసీయూ చైర్మన్ అన్నం నాగమల్లేశ్వరయ్య, ఎన్ఎస్ఎస్ పీవో ఉదయ్ ప్రకాశ్ రెడ్డి, ప్రదీప్‌కుమార్, పల్లాభాస్కర్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో అడిషనల్ కమిషనర్

సామాజిక న్యాయం అందుబాటులోకి రావాలి

● సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

కడప(రూరల్) ఫిబ్రవరి 20 : పేదరికం, నిరక్షరాస్యత, మతరమైన వివక్షలను తొలగించడానికి సామాజిక న్యాయం అందుబాటులోకి రావాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ సామాజిక న్యాయదినోత్సవం సందర్భంగా కడప నగరం సరోజినీ నగర్ ఎస్టీకాలనీలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సామాజిక న్యాయంపై అవగాహనను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ లేబర్ వెల్ఫేర్ అఫీసర్ హెచ్.వెంకటసుబ్బయ్య, గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరక్టర్ ఎస్.కరీముల్లాబాషా, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎల్.యోగయ్య, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి బాబాఫక్రుద్దీన్

కడప - బెంగళూరు రైల్వేపనులను విస్మరించిన జగన్ ప్రభుత్వం

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 20: కడప-బెంగళూరు రైలుమార్గ నిర్మాణాన్ని జగన్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం కడప-బెంగుళూరు రైలు మార్గం పనులను ఆయన పరిశీలించారు. పెండ్లి మర్రి రైల్వేస్టేషన్, ట్రాక్‌పై పెరిగిన కంపచెట్ల వద్ద ఆయన సెల్ఫీ తీసుకుని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సుమారు వెయ్యి కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఐదేళ్లలోగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త సహకారంతో పూర్తి చేయాలన్న సంకల్పంతో అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ ప్రభుత్వంలో ఆమోదించగా, 2010 సంవత్సరం సెప్టెంబరులో శంకుస్థాపన చేశారన్నారు. ఐదేళ్లలో పూర్తి చేస్తామని సంకల్పించినా ఇప్పటికీ 15 సంవత్సరాలు గడిచిందన్నారు. వైఎస్ కుమారుడు జగన్‌రెడ్డి ఈ రైల్వేలైను పనుల వైపు కన్నెత్తి కూడా చూడలేదని విమర్శించారు. ఈ రైల్వే లైను ఏర్పాటు అయితే కడప జిల్లా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.



పెండ్లిమర్రి రైల్వేస్టేషన్‌ను చూపిస్తున్న గోవర్ధన్‌రెడ్డి

ఇరువురు మట్కా నిర్వాహకులు అరెస్టు

కడప(క్రైం), ఫిబవరి 20: కడప నగరం ఉక్కాయపల్లి డంపింగ్‌యార్డు సమీపంలో మట్కా నిర్వహిస్తున్న ఇరువురిని అరెస్టు చేసినట్లు చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి తెలిపారు. కడపకు చెందిన మున్నా, మహబూబ్ బాషాలు మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ రవికుమార్ సిబ్బందితో దాడి చేసి ఇరువురిని అరెస్టు చేసి.. వారి వద్ద నుంచి రూ.32520 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

50 మద్యం బాటిళ్లు స్వాధీనం

వల్లూరు, ఫిబ్రవరి 20: మండల పరిధిలోని మిట్టపల్లెలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 50 మద్యం బాటళ్లను స్వాధీనర చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించి మద్యంతో పాటు వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 20 : పాత కడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్టెప్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి సాయిగ్రేస్, ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ థామస్ రెడ్డి ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిత్వం అనేది ఒక వ్యక్తి వాస్తవ పరిస్థితుల పట్ల ప్రదర్శించే ప్రవర్తన ద్వారా వర్గీకరించబడుతుందన్నారు. ఒక దేశం భవిష్యత్తు తరగతి గదిలో రూపొందుతుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు విశ్వభారతి, ఇన్‌చార్జ్ ప్రధాన ఉపాధ్యాయుడు ఆర్.నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు,

హోమియోతో మెరుగైన ఫలితాలు

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 20 : హోమియోపతిలో ఆరోగ్య సమస్యలకు చక్కని పరిష్కారాలు ఉన్నాయని కమలాపురం ప్రభుత్వ హోమియోపతి మెడికల్ ఆఫీసరు డాక్టర్ షాకీర్ హుసేన్ అన్నారు. కమలాపురం పట్టణంలోని గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థినులకు మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధినిరోధక శక్తి పెంపొందించడానికి, జలుబు, దగ్గు, మహిళల్లో బహిష్టు సమయాల్లో వచ్చే కడుపు నొప్పి తదితర వ్యాధుల నివారణకు హోమియో మందులు ఉన్నాయన్నారు. అనంతరం జెల్సీమియమ్ 200 హోమియోపతి మాత్రలు విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు.

వేసవిలో జాగ్రత్తగా ఉండాలి

చక్రాయపేట, ఫిబ్రవరి 20: రానున్న వేసవి కాలంలో విద్యార్థులు తగు జాగ్రత్తలు తీసుకో వాలని సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఆర్.నాగేంద్రరాజు పేర్కొన్నారు. మంగళవారం ఆయన చక్రాయపేట బీసీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మెనూ పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులను సమావేశపరిచి మెనూ ప్రకారం అన్ని అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. రానున్న 10వ తరగతి పరీక్షలకు ప్రణాళికతో చదవాలన్నారు. ట్యూటర్లు సక్రమంగా వస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారి రాజబాబు, ట్యూటర్లు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించండి : ఎస్ఈ

వేంపల్లె, ఫిబ్రవరి 20: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసి మన్ననలు పొందాలని ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ రమణ ఉద్యోగులకు సూచించారు. ఆయా మండలాల పరిధిలో పలు చోట్ల విద్యుత్ సబ్‌స్టేషన్లను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలిచ్చారు. మంగళవారం వేంపల్లె పట్టణంలో చక్రాయపేట, వేముల, వేంపల్లె విద్యుత్ సిబ్బంది, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో సేవలందించడంలో మొదటి స్థానంలో నిలిచిన వేంపల్లె రూరల్ విద్యుత్ సెక్షన్ ఏఈ శివ, విద్యుత్ ఉద్యోగులను అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఉద్యోగులు బాధ్యతగా పనిచేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వ్యవసాయానికి, గృహ అవసరాలకు అంతరాయం కలుగకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. ఏడీఈలు గురుమూర్తిరెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



వేంపల్లె రూరల్ సెక్షన్ విద్యుత్ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎస్ఈ రమణ

మార్కెట్‌యార్డులో మౌలిక సదుపాయాలు కల్పించాలి

కడప(రూరల్), ఫిబ్రవరి 20 : తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాస రెడ్డిమంగళవారం కడప మార్కెట్‌యార్డును సందర్శించారు. హమాలీలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయనకు హమాలీలు తమ సమస్యలపై ఏకరువు పెట్టారు. మార్కెట్ యార్డులో 100 మందికి పైగా హమాలీ వర్కర్లం పనిచేస్తున్నామన్నామని.. కనీసం తాగడానికి గుక్కెడు మంచినీరు లేక అల్లాడుతున్నామన్నారు. వేసవికాలం కావడంతో దాహంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు మార్కెట్ యార్డులో తాగునీరు, మరుగుదొడ్ల సమస్యలపై గోడును వెళ్లబోసుకున్నా ఫలితం లేదన్నారు. మీరైనా తమ సమస్యలను పరిష్కరించాలని వేడుకున్నారు. సమస్యల పరిష్కారానికి ఆయన సానుకూలంగా స్పందించారు. కడప మార్కెట్ కమిటీ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయకపోతే త్వరలోనే తమ సొంత నిధులతో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో హమాలీలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆయన వెంట మర్చంట్ అసోసియేషన్ నాయకులు మహేష్, పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటుపై నిలదీత

కడప మార్కెట్ యార్డులో చలివేంద్రం ఏర్పాటుపై మంగళవారం మార్కెట్ కమిటీ సభ్యులను హమాలీలు ప్రశ్నించారు. మార్కెట్‌యార్డులో మినిరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయకుండా తాత్కాలికంగా నాలుగు బానలు వుంచి చలివేంద్రం ఏర్పాటు చేసి చేతులు దులిపేసుకుంటున్నారని ఆవేదన చెందారు. గత ఏడాది ఇలానే చలివేంద్రం ఏర్పాటుచేసి వాటి నిర్వహణను పట్టించుకోలేదని... దీంతో బానల్లో బల్లులు, ఇతర కీటకాలు దర్శనమివ్వడంతో తాము వాటిని ఉపయోగించుకోలేదని నిలదీశారు. అయినప్పటికీ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అధికారులు, కమిటీ డైరక్టరు బంగారు నాగయ్య తదితరులు ప్రారంభించి మమ అనిపించారు.



శ్రీనివాసరెడ్డికి సమస్యలను విన్నవిస్తున్న మహిళా హమాలీ

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి అప్రజాస్వామికం

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 20 : అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్ర జ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి జరగడం హేయమైన చర్య అని ఆర్ఎస్ వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కన్నెలూరు శంకర్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం కడప నగరం ఆర్ఎస్‌వైఎఫ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి బహిరంగ సభలోనే ఆయన ఎదుటే విలేకరులపై దాడి జరిగితే ఇంత వరకు ఆ సంఘటన మీద స్పందించక పోవడం దారుణమన్నారు. ఇలాంటి దాడులు ప్రజాస్వామ్యానికి ప్రమాదక రమని విచారం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్ స్పందించి దాడి సంఘటనపై విచారణ జరిపించి నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఓరుగంటి నాగేంద్రబాబు, నాయకులు శ్రీనాధ, తరుణ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

వైసీపీ మూకల దాడి అమానుషం

కడప (చిన్నచౌకు), ఫిబ్రవరి 20: రాప్తాడులో సీఎం జగన్ సభ సందర్భంగా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై జరిగిన దుర్మార్గమైన మూకుమ్మడి దాడిని డీవైఎఫ్ఐ కడప నగర కార్యదర్శి డీఎం ఓబులేసు తీవ్రంగా ఖండించారు. సీఎం సభకు సంబంధించిన దృశ్యాలను చిత్రీకరిస్తున్న ఫొటోగ్రాఫర్‌పై విచక్షణ రహితంగా దాడి చేసి కొట్టడం అన్యాయమన్నారు. దాడికి పాల్పడ్డ నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించండి

చక్రాయపేట, ఫిబ్రవరి 20: మామిడి పంటలో సమగ్ర యాజమాన్య పద్ధ తులు పాటించాలని ఉద్యానశాఖ అధికారి రెడ్డయ్య రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని సురభి గ్రామంలో మామిడి తోటలను పరిశీ లించిన ఆయన రైతులతో మాట్లాడారు. మామిడిలో ప్రస్తుతం మొగ్గం, పూత పిందె దశలో ఉందన్నారు. తేనె మంచు పురుగు ఉన్న నేపథ్యంలో మందులు పిచికారీ చేయాలని సూచించారు. పూతసరిగా రాని తోటల్లో తేలికపాటి నీటి తడులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు



రాహుకాల పూజలు చేస్తున్న మహిళలు, ప్రత్యేక అలంకరణలో విజయదుర్గాదేవి అమ్మవారు

కడప (కల్చరల్) ఫిబ్రవరి 20: నగరంలోని బిల్టప్ సర్కిల్ సమీపంలోగల విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేసేందుకు జిల్లా నలుమూలల నుంచి పలువురు మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అలా చేయడం వలన కోరిన కోర్కెలు త్వరితగతిన నెరవేరగలవని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ముఖ్యంగా వివాహ, ఉద్యోగ, అవకాశాలతో పాటు గ్రహ సంబంధ బాధలు తొలగిపోతాయని నమ్మకం.

వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 20: పులివెందులలో వెలసిన పద్మావతీ సమేత కల్యాణ వేంకటరమణ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మో త్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదవరోజు ఉదయం శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారు కల్పవృక్షవాహనంపై గ్రామోత్సవంగా వస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే సాయంత్రం సర్వ భూపాలవాహనంపై గ్రామోత్సవంగా ఊరేగారు. పాత బస్టాండ్, పూలంగళ్లు, ముత్యాలవారివీధి ప్రాంతాల మీదుగా ఆలయానికి చేరుకున్న స్వామివారికి అడుగడు గునా భక్తులు భక్తిశ్రద్ధలతో మొక్కుకున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు, అర్చకులు భరద్వాజలు స్వామి, అమ్మవార్లకు ఉదయాన్నే ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మో త్సవాల సందర్భంగా ఆలయానికి భక్తులు అధికసంఖ్యలో చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు.



కల్పవృక్ష వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా దర్శనమిచ్చిన వేంకటేశ్వరస్వామి

రామాపురం పుణ్యక్షేత్రంలో ఉత్తర ద్వార దర్శనం

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 20: మండల పరిధిలోని రామాపురం పుణ్యక్షేత్రంలో భీష్మ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం ద్వారా మహా లక్ష్మి సమేత మోక్ష నారాయణస్వామిని దర్శించుకునేందుకు వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. ఉదయం 10 గంటల నుంచి అనపాటి నాగరాజు గురూజీ దివ్య ఆశీస్సులతో సిద్ద సమాధి యోగ కడపశాఖ ఆధ్వర్యంలో పంచముఖి గాయత్రి మహాయజ్ఞం ప్రారంభించి.. చివరగా పూర్ణాహుతితో ముగిం చారు. సాయంత్రం గరుడ వాహనంపై మహాలక్ష్మి మోక్ష నారాయ ణస్వామిని మాఢవీధుల్లో ఊరేగించారు. మహాహారతి తరువాత ఆలయ ప్రధా న సేవకులు కాశిభట్ల సత్యసాయినాధశర్మ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసా దాలతో పాటు భోజనాలు ఏర్పాటు చేశారు.

బంజారా గర్జన సభకు తరలిరండి

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 20: సత్యసాయి జిల్లా కదిరిలో ఈనెల 25వ తేదీ తలపెట్టిన బంజారా గర్జనసభకు జిల్లాలోని అన్ని తాండాల నుంచి బంజారావాసులు పెద్దఎత్తున తరలిరావాలని ఆల్‌ఇండియా బంజారా సేవాసంఘం రాష్ట్ర కోశాధికారి శివానాయక్ పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక ఐటీఐ సమీపంలో గల ఆ సంఘం జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, రంగాలలో వెనుకబడి వున్న బంజారాలను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో సభను ఏర్పాటు చేశారన్నారు. సమావేశంలో వెంకటస్వామినాయక్, కృష్ణనాయక్, బీడీ నాయక్, గోపినాయక్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి పలువురు చేరిక





జమ్మలమడుగు, ఖాజీపేటలో పార్టీలోకి ఆహ్వానిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జీలు భూపేశ్‌రెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్

జమ్మలమడుగు, ఫిబ్రవరి 20: జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం పలువురు భూపేశ్‌రెడ్డి సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. మైలవరం మండలం తొర్రివేముల గ్రామానికి చెందిన పలువురు వైసీపీకి చెందిన కార్యకర్తలు ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వెంకటేష్, శ్రీకృష్ణ, వెంకటరాముడు, సుబ్బయ్య, రామాంజనేయులు తదితరులు చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాయల్‌కిరణ్, గురప్ప, రామాంజనేయులు, నాగార్జున, రామారావు, యేసన్న, రామాంజనేయులు, సుబ్బరాజా పాల్గొన్నారు.

● **20 కుటుంబాలు టీడీపీలో చేరిక..:** జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం పెద్దముడియం మండలం పెద్దపసుపుల గ్రామానికి చెందిన 20 కుటుంబాలు భూపేశ్‌రెడ్డి సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. చేరిన వారిలో నరసింహులు, చిన్న ఓబన్న, మహేష్, రామచంద్ర, పెద్దవీరయ్య, కొండయ్య, రామాంజనేయులు, శంకర్, అంజనేయులు, యల్లప్ప, శ్రీకాంత్, సుబ్బరాయుడు, ఓబన్న, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కిశోర్‌రెడ్డి, సుబ్బరాయుడు, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఖాజీపేట..: ప్రతి నాయకుడు, కార్యకర్త కలిసికట్టుగా పనిచేయాలని మైదుకూరు టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. మంగళవారం కొమ్ములూరులో వైఎస్‌ఆర్ మండల సంయుక్త కార్యదర్శి పుత్తా విజయభాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పుత్తా జయమ్మ, పుత్తా మల్లారెడ్డి, వార్డు సభ్యులు పుత్తా చంగల్‌రెడ్డి, పాలగిరి చిన్నారెడ్డి, షేక్ మాబూసాహెబ్, వైసీపీ బూత్ కోకన్వీనర్ పోతుల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మైదుకూరు టీడీపీ ఇన్‌చార్జి సుధాకర్ యాదవ్ సమక్షంలో దాదాపు 100 కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, జనసేన మైదుకూరు ఇన్‌చార్జి మల్లోత్ర, నాయకులు సుధాకర్‌రెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఫరూక్, బీఎల్ శ్రీనివాసులు, మేకల బాబు, మల్లికార్జునరెడ్డి, జిలానీ, సుబ్బయ్య, వీరయ్య, పూల సుల్తాన్, క్రిష్ణారెడ్డి, గంగిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గ్రేటర్ రాయలసీమ రాష్ట్ర కన్వీనర్ ఆంజనేయులు

బద్వేలు, ఫిబ్రవరి 20: ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా, ప్రశాంతంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గ్రేటర్ రాయలసీమ రాష్ట్ర కన్వీనర్ కారు ఆంజనేయులు, జిల్లా కన్వీనర్ ఓబయ్య పేర్కొన్నారు. మంగళవారం గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు ఎంతో కీలకమైనవన్నారు. పోటీచేసే అభ్యర్థులు సామరస్యంగా ఎన్నికల్లో పాల్గొనాలని, అధికారులు ప్రశాంతవాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో తన ప్రత్యర్థి, అభ్యర్థిని బెదిరించిన ఘటన, కడప డిప్యూటీ సీఎం తమ్ముడు ప్రత్యర్థి మహిళా అభ్యర్థి పైన ప్రవర్తించిన తీరు సరికాదని ఖండించారు.అలాగే కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలపై సోషల్‌మీడియాలో వస్తున్న వ్యక్తిగత దూషణలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయన్నారు. అలాగే రాప్తాడు బహిరంగ సభలో విలేకరి పైన జరిగిన దాడి అమానుషమని, దీని వలన ఆందోళన కార్యకమాలు చేపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ చంద్రశేఖర్, పట్టణ కార్యదర్శి జకరయ్య, సభ్యులు జయపాల్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా ప్రధాన రోడ్డు





గుంతలు పడి, ఛిద్రమైన రోడ్డు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 20: ప్రధాన రోడ్డు అధ్వానంగా మారింది. దారి పొడవునా గుంతలు, గతుకులు. జమ్మలమడుగు మండలంలోని ఎస్.ఉప్పలపాడు గ్రామం వద్ద నుంచి కోవెలకుంట్లకు వెళ్లే దారి అధ్వానంగా మారింది. ఏళ్ల గడుస్తున్నా ప్రధాన రోడ్డును ఎవరూ పట్టించుకోవడంలేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ రోడ్డు ప్రయాణికులు, వాహనదారులకు నరకప్రాయంగా మారింది. ఆదమరిస్తే ద్విచక్ర వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయని వాపోతున్నారు. ఆటోలు, తదితర వాహనాల డ్రైవర్లు ఆ రోడ్డులో ప్రయాణం చేయాలన్నా చాలా ఇబ్బంది పడుతున్నారు. జమ్మలమడుగు నుంచి కర్నూలు జిల్లాకు వెళ్లాలన్నా ప్రొద్దుటూరు మీదుగా కొర్రపాడు, రాజుపాళెం, తదితర ప్రాంతాల నుంచి చేరుకుని బైపాస్‌లో వెళుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం కారణంగానే ఈ రోడ్డుకు ఏళ్ల గడుస్తున్నా మోక్షం లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధాన రోడ్లపై దృష్టి సారించి వెంటనే రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రాయలసీమ రాష్ట్ర ఏర్పాటుకు రోడ్ మ్యాప్ ప్రకటించాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 20 : రాయలసీమ రాష్ట్ర ఏర్పాటుకు రోడ్ మ్యాప్ ప్రకటించాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి లేఖ రాసినట్లు రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాయలసీమ దశాబ్దాలుగా వెనుకబడిందన్నారు.

రవిదాసు జయంతిని ప్రభుత్వం నిర్వహించాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 20 : సద్గురు సంత్ గురు రవిదాసు జయంతిని రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 24న ఆయన జయంతిని ఎన్జీఓ హోంలో ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగభూషణం మాదిగ, బాలలక్షుమయ్య మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి ఆధ్యాత్మిక ప్రవచనాలు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 20 : వాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు చండీ తత్వంపై ఆధ్యాత్మిక ప్రవచనాలు ఉంటా యని ఆర్యవైశ్యసభ కార్యదర్శి మురికి నాగేశ్వరరావు తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంట లకు బెంగళూరుకు చెందిన ప్రొఫెసర్ కె.శారద చండీ తత్వం పై ప్రవచనాలు చేస్తారని, భక్తు లు పాల్గొనాలని కోరారు.

బోధన పద్ధతిలో మెలకువలు పాటించాలి



ఉపాధ్యాయులకు బోధన పద్ధతులపై మెలకువలు తెలియజేస్తున్న దృశ్యం

ముద్దనూరు ఫిబ్రవరి20: బోధన, సాధన పద్ధతిలో ఉపాధ్యాయులు మెలకువలు పాటించాలని అనంతపురం జిల్లా బుక్కపట్నం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక బాలుకల ఉన్నత పాఠశాలను అభ్యసనాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మంగవారం రాష్ట్ర బృందం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, డైట్ ఫ్యాకల్టీ రాజేంద్రప్రసాద్, గణిత అబ్జర్వర్ అట్లా నరసింహారెడ్డి, తెలుగు అబ్జర్వర్ జిసి.నాగప్ప సందర్శించారు. ఈసందర్భంగా తరగతి గదిలో ఉపాధ్యాయుల పాటించాల్సిన బోధన, సాధన పీరియడ్ల మెలకువలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నాగేశ్వర నాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన జగన్'



మాట్లాడుతున్న నంద్యాల కొండారెడ్డి

ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి 20 : విభజనతరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజధాని లేకుండా జగన్ చేశాడని టీడీపీ నాయకుడు నంద్యాల కొండారెడ్డి విమర్శించారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌కు అన్ని విధాల సౌకర్యంగా వుండేందుకు అమరావతి రాజధానిని నిర్మాణానికి పూను కున్నారన్నారు. ఎలాంటి భూసేకరణ చేపట్టకుండా ల్యాండ్ పూలింగ్ ద్వారా 50 వేల ఎకరాల భూములను సేకరించారన్నారు. చాలా శాస్త్రీయ నివేదికల ఆధారంగా అక్కడ చేపట్టారన్నారు.జగన్ ప్రతిపక్షంలో వుండగా అమరావతి రాజధాని పై ఎలాంటి అభ్యంతరం తెలపలేదన్నారు. అధికారంలోకి వచ్చాక ఎక్కడ అమరావతి రాజధానిని కొనసాగిస్తే చంద్రబాబుకు చరిత్రలో పేరునిలబడిపోతుందో నని దానిని చెరిపేసే లక్ష్యంగా సైకో పద్ధతిలో ఆలోచించారన్నారు. సమావేశంలో టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు ,మున్సిపల్ మాజీవైస్‌చైర్మెన్‌కొండయ్యపల్లె శంకర్ ,గోపవరం లక్ష్మణ పాల్గొన్నారు.

రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడిపై దాడి దారుణం

జమ్మలమడుగు, ఫిబ్రవరి 20: రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసులరెడ్డిపై దాడి చేయడం దారుణమని జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి తుమ్మలూరు మల్లికార్జున అన్నారు. మంగళవారం రాత్రి స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడుపై ఒంగోలులో దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఆయనపై జరిగిన దాడిని తెలుగు రైతు కమిటీ తరుపున ఖండిస్తున్నట్లు, దాడి చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు పాల్గొన్నారు. అనంతరం రాప్తాడు నియోజకవర్గం సిద్ధం బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగిస్తుండగా 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై అక్కడి వైసీపీ కార్యకర్తలు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మీడియాపై సమాజం తలదించుకునే విధంగా దాడి చేయడం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే సిగ్గుచేటన్నారు.

బద్వేలు రూరల్..: టీడీపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసులరెడ్డిపై కత్తులతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డ వారిపై కేసులు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి పల్లెం యల్లారెడ్డి మంగళవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయనపై దాడిచేయడం దారుణమన్నారు. తీవ్ర గాయాలపాలైన ఆయన ఆరోగ్యం ప్రస్తుతం విషమ పరిస్థితుల్లో ఉందని దాడికి పాల్పడ్డ వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మీడియా గొంతునొక్కడం అమానుషం

జమ్మలమడుగు, ఫిబ్రవరి 20: మీడియా గొంతునొక్కడం అమానుషమని బీజేపీ ఎస్సీమోర్చ నాయకులు మేకల అంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అనంతపురంజిల్లా రాప్తాడులో జరిగిన 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణ మీద వైసీపీ అల్లరిమూకలు దాడి చేయటం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభలో మీడియాపై ఒక వ్యక్తిని టార్గెట్ చేసుకుని దారుణంగా కొట్టడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనన్నారు. విచారణ జరిపి దాడి చేసినవారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సభ్యులు పుష్పరాజు, రాజశేఖర్, నాగరాజు, పెద్దులయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

పేదవారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తాం

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 20 : మండల న్యాయసేవాధికార సంస్థ ద్వారా కుల మతం వివక్ష లేకుండా సమానంగా పేదవారికి ఉచిత న్యాయ సహాయం అందించబడుతుందని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్ పర్సన్ సీనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ తెలిపారు. వరల్డ్‌డే ఆఫ్ సోషల్ జస్టిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ ఆఫీసు సమీపంలో ఉన్న నైట్ షెల్టరు హోంను వారు సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న వారి బాగోగులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వృద్ధులకు పండ్లను ఆమె పంపిణీ చేశారు.

చంద్రబాబుతోనే నాయీ బ్రాహ్మణుల అభివృద్ధి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 20: చంద్రబాబుతోనే బీసీలకు భరోసా, నాయీ బ్రాహ్మణుల సంక్షేమం జరుగుతుందని టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మధ్యాహ్నం జమ్మలమడుగు మండలంలోని దేవగుడి గ్రామంలో టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి నాయీబ్రాహ్మణుల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయం కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. నాయీ బ్రాహ్మణులకు జగన్ మోహన్‌రెడ్డి ద్రోహం తప్ప చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ కడప పార్లమెంటు సాధికార సభ్యుడు సుబ్బరాయుడు, దొమ్మరనంద్యాల నరసింహులు, ప్రసాద్, కాశీవిశ్వనాథ్, లోకేష్, చరణ్ పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతోనే ఆరోగ్యం

జమ్మలమడుగు, ఫిబ్రవరి 20: చేతులు శుభ్రతతో మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని జమ్మలమడుగు మున్సిపల్ చైర్‌పర్సన్ శివమ్మ అన్నారు. మంగళవారం జమ్మలమడుగు పాత బస్టాండు మున్సిపల్ కార్యాలయం మస్టర్ పాయింట్ వద్ద ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో హ్యాండ్‌వాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారి గంగులయ్య, సీవో రసూలరమ్మ, ఎస్ఎల్ఎఫ్ ఆర్పీలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రషీద్ ఖాన్

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 20 : ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పి.రషీద్ ఖాన్ ఎన్నికైనట్లు ఎస్టీయూ రీజనల్ కన్వీనర్ డి.సలీం తెలిపారు. ఎస్టీయూ 77వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు ఈనెల 18న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జరిగాయన్నారు. రషీద్ ఖాన్ ఎస్టీయూ నాయకునిగా సంఘం బలోపేతానికి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని, ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

22న జనసేన సమావేశం

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 20 : పోరుమామిళ్లలోని సీసీ ఆర్ కాంప్లెక్స్‌లో పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బికోడూరు మండలాల పోలింగ్ బూత్‌ల ఏజంట్ల సమావేశం ఈ నెల 22న జరుగుతుందని జనసేన నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మురళిక్రిష్ణ, నందకిశోర్, రమణ, ఇమ్రాన్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 20 : సావిశెట్టిపల్లె గ్రామంలో మదర్‌థెరిస్సా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాశ్‌రెడ్డి ఆదేశాల మేరకు ట్రస్టీ చిత్తా గిరిప్రణీత్‌రెడ్డి ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 250 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రోహిత్, బాషా, వెంకీ, ఖాజా, ప్రభావతి, రాజేశ్వరి, మురళి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పట్ల అందరూ సహకరించాలి

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 20 : ట్రాఫిక్ నిబంధనల పట్ల ప్రజలు, వ్యాపారులు సహకరించాలని సీఐ చిరంజీవి అన్నారు. మంగళవారం రాత్రి స్థానిక మహాత్మాగాంధి విగ్రహం సర్కిల్‌లో వ్యాపారులు, ఆటో డ్రైవర్లతో, ప్రజలతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ రోజురోజుకూ పెరుగుతుందనివాహనాలను రోడ్లకిరువైపులా ఉంచరాదని ఆటోలను ఎక్కడ పడితే అక్కడ ఆపరాదన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలన్నారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించండి

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 20 : మున్సిపాలిటీ పరిధిలోని శీలంవారిపల్లె ప్రాథమిక పాఠశాలకు ప్రహరీగోడ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. మంగళవారం శీలంవారిపల్లె ప్రాథమిక ఉన్నత పాఠశాలను ఆయా విద్యార్థుల తల్లిదండ్రులు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ నాడు నేడు పనుల్లో భాగంగా ప్రతి పాఠశాలకు ప్రహరీ తో పాటు కనీస సౌకర్యాలు కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని నేటికీ తమ పూరి ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి నోచుకోలేదని వారన్నారు. పాఠశాల ఆవరణలో కుక్కలు, పందులు. పాములు సంచరిస్తున్నాయని తెలిపారు.

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 20 : పచ్చని చెట్లే ప్రగతి మెట్లు అని బిజివేముల వీరారెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటసుబ్బారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని గుంతపల్లెలో ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులతో మొక్కలు నాటి వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంటు రామ్మోహన్, ఎన్ఎస్ఎస్ యూనిట్ సమన్వయ కర్త దొరస్వామి నాయక్ పాల్గొన్నారు.

ప్రజల శ్రేయస్సే ధ్యేయం

అట్లూరు, ఫిబ్రవరి 20 : అట్లూరు ప్రజల శ్రేయస్సే తన ధ్యేయమని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఎస్.విజయజ్యోతి అన్నారు. మంగళవారం అట్లూరులో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల తనను కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా ప్రకటించడం జరిగిందన్నారు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు కాట్పుటి పెంచలయ్య, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాశినాయన గుడిని అభివృద్ధి చేస్తాం

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 20 : అవధూత కాశినాయన గుడి అభివృద్ధికి కేంద్ర సహకారం ఉంటుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యద ర్శి ఉట్టిశ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఇటలీవల జరిగిన పరిణామాలను జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి ద్వారా రాష్ట్ర బీజేపీ పెద్దలకు తెలిపామన్నారు. దేవాలయాల విషయంలో బీజేపీ మినహా ఇతర రాజకీయ పార్టీలన్నీ రాజకీయం చేస్తూ ఓట్ల కోసం ప్రజలను మభ్యపెడుతూ పరిస్థితిని బట్టి మారుస్తూ మనుగడ సాగిస్తున్నారన్నారు. బీజేపీ మాత్రం హిందుత్వం, హిందూ ధర్మం కోసం నూరు శాతం పని చేస్తుందన్నారు.

ఉన్నత వ్యక్తిత్వం కలిగి ఉండాలి

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 20 : విద్యార్థినులు ఉన్నత వ్యక్తిత్వం కలిగి ఉండాలని ఆకతాయితీలతో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టకి తేవాలని సీఐ చిరంజీవి తెలిపారు.మంగళవారం పోరుమామిళ్లలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో పది, ఇంటర్ విద్యార్థినులకు పబ్లిక్ పరీక్షలకు అవసరమయ్యే సామగ్రిని వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. పరీక్ష సామగ్రిని అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ ఓబులేసు సాయం చేయడంతో వాటిని ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వివేక నందఫౌండేషన్ వ్యవస్థాపకుడు రామక్రిష్ణారెడ్డి, నజీమాబేగం, పద్మావతి, సుప్రజ, ధనలక్ష్మి, లూసీ పాల్గొన్నారు.

అహోబిలానికి పాదయాత్ర

కొండాపురం, ఫిబ్రవరి 20 : రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి అఖండ మెజారిటీ తో గెలిచి ప్రభుత్వం ఏర్పాటుచేయాలని అహోబిలం పాదయాత్ర చేస్తున్నట్లు మండల జనసేన కన్వీనర్ నరసింహా తెలిపారు.కొండాపురం మండలం తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన నరసింహా మంగళవారం తాళ్లప్రొద్దుటూరు నుంచి అహోబిళం పాదయాత్రగా బయలుదేరారు.

జగన్ పాలనలో అభివృద్ధి శూన్యం

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 20 : జగన్ పాలనలో అభివృద్ధి శూన్యమని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని నంగనూరు పల్లెలో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం వరదరాజులరెడ్డి నేతృత్వంలో జరిగింది. ఈసందర్భంగా టీడీపీ ముందస్తు ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కొండారెడ్డి, ఘంటశాల వెంకటేశ్వర్లు,నాగమునిరెడ్డి, బచ్చల వీరప్రతాప్, పార్వతమ్మ, వంశీ, మునిస్వామి నాయుడు, డీలర్ గుర్రప్ప, చెల్లుబోయిన రామకృష్ణ, బత్తల బాబు, మల్లికార్జు, కదిరే పల్లి గంగన్న, భైరగాని రవి పాల్గొన్నారు.

వైసీపీని ఇంటికి పంపాలని
ప్రజలు నిర్ణయించుకున్నారు : సీఎం సురేశ్‌నాయుడు

ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి 20 : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలని ప్రజలు నిర్ణయించుకున్నారని టీడీపీ నాయకుడు సీఎం సురేష్ నాయుడు అభిప్రాయం వ్యక్తం చేశారు. మంగళవారం 13 వవార్డు కాన్పుల ఆసుపత్రి వద్ద బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బాబు ఆరు గ్యారెంటీల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మెన్ వీఎస్ ముక్తియార్, మాజీ రాజుపాళెం ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి,రాష్ట్ర కార్యదర్శి ఈవీ సుధాకర్ రెడ్డి, నల్లబోతుల నాగరాజు, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: మహిళలను కించపరటం దారుణమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం స్థానిక సోముల వారి పల్లెలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీకార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మౌనికారెడ్డి,హరితారెడ్డి, బెజవాడ అమ్మణ్ణి, కిరణ్ రామచంద్రారెడ్డి, నందం లక్ష్మీదేవి, ఏరువ హనుమంతరెడ్డి , సీతారామిరెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.







ప్రొద్దుటూరులో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, సీఎం సురేశ్‌నాయుడు, ప్రవీణ్‌రెడ్డి తదితరులు